క్లుప్తంగా

అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చివ్వెంల : మండల పరిధిలోని అక్కలదేవిగూడెం గ్రామం వద్ద సూర్యాపేట–ఖమ్మం 365 బీబీ రహదారిపై అండర్‌పాస్, సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు గురువారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్‌రెడ్డి, సర్పంచ్ పుట్ట గుర్వేందర్, ఎంపీటీసీ మిర్యాల పార్వతమ్మ, గోవిందరెడ్డి, మండవ మధు, భిక్షం, అనిల్ నాయక్, నాగయ్య, నాగరాజు, విజయ్, సైదులు, నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉపేందర్



ఆత్మకూర్(ఎస్) : ఫిబ్రవరి 14, 15 తేదీల్లో నల్లగొండలో జరిగిన డీవైఎఫ్ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో మండల పరిధిలోని ఏపూరు గ్రామానికి చెందిన సానబోయిన ఉపేందర్ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల సమస్యలను గాలికి వదిలేశాయని తెలిపారు. యువకుల సమస్యలపై పోరాటాలు చేస్తానని తెలిపారు.

గడువు పొడిగింపు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈ నెల 22 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ జి. భాగ్యలక్ష్మి గురువారం తెలిపారు.

ఆర్డీఆర్‌కు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

భానుపురి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మోకాలి శస్త్ర చికిత్స చేయించుకొని మొట్టమొదటిసారిగా సూర్యాపేటకు వస్తున్న సందర్భంగా ఆ పార్టీ నాయకులు గురువారం సూర్యాపేట సమీపంలో జాతీయ రహదారిపై ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, చకిలం రాజేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అంజాద్ అలీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

అర్వపల్లి : మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన అంబేద్కర్ ఆర్ట్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బందెల అర్వపల్లి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అర్వపల్లిని గురువారం ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పరామర్శించారు. రోడ్డు ప్రమాదం ఎలా జరిగిందనే విషయం అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, బొడ్డు రామలింగయ్య, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, పందిరి యుగేందర్, ఉపసర్పంచ్ పి.ప్రభాకర్, ప్రభు, వెంకన్న, వీరయ్య, శశికాంత్ తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నాగారం : నాగారంబంగ్లా యాదవ సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన అనిల్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా భయ్యం లింగయ్య, తొడుసు శంకర్, కార్యదర్శులుగా ఆవుల వెంకన్న, ననుబోతుల గణేష్, కోశాధికారిగా గంట రాంమూర్తి, కార్యవర్గ సభ్యులుగా పాక గట్టయ్య, దోమల వెంకన్న, కన్నెబోయిన వీరయ్య, మంగదుడ్ల వీరయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో దోమల వెంకన్న, యాదయ్య, వీరయ్య, ఇస్తారి, లింగయ్య పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

శివరాత్రి మహోత్సవాలకు వేళాయే..

- ముస్తాబైన ఆలయాలు
- పలు ఆలయాల్లో ఉత్సవాలు ప్రారంభం
- అధిక సంఖ్యలో పాల్గొననున్న భక్తులు

పెన్‌పహాడ్ : పెనపహాడ్ మండల కేంద్రంలోని శ్రీ శంభులింగేశ్వర స్వామి ఆలయంతో పాటు మండల పరిధిలోని నాగులపహాడ్ త్రికూటేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. నాగులపహాడ్‌లో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ సంకరమద్ది నిరంజన్‌రెడ్డి తెలిపారు.

వేడుకలు ఇలా..

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా నాగులపహాడ్‌లోని త్రికూటేశ్వర ఆలయంలో ఈ నెల 18న గణపతి హోమం, మృత్యుంజయహోమం, అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం అలంకరణ దర్శనం, పురవీధుల్లో స్వామి అమ్మవార్ల పల్లకి సేవ, భజనలు, శివపార్వతుల కళ్యాణం, ఉపవాస దీక్ష విరమణ చేపడతారు. ధర్మపురం బృందం వారిచే బ్రహ్మంగారి బుర్రకథ కార్యక్రమం ఉంటుంది. శ్రీమన్నారాయణ భజన బృందం వారిచే భజనలు, శివ భజనలు, శివ భక్తి గీతాలు, నాటికలు నిర్వహిస్తారు. 19న అభిషేకాలు, అర్చనలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా, డ్యాన్స్‌లు నిర్వహిస్తారు. 20న అర్చనలు, అభిషేకాలు ఉంటాయి. త్రికుటేశ్వర ఎంటర్ టైనర్ వారి ఆధ్వర్యంలో డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 21న శివపార్వతుల ఉత్సవ మూర్తుల ఊరేగింపుతో ఉత్సవాలు ముగియనున్నాయి.



నాగులపహాడ్‌లోని త్రికూటేశ్వరాలయం

జిల్లా స్థాయి గ్రామీణ క్రీడలు..

నాగులపహాడ్ జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 18న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ, మహిళా కోలాట పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సంకరమద్ది నిరంజన్‌రెడ్డి తెలిపారు. కబడ్డీ ప్రథమ బహుమతి రూ.30016, ద్వితీయ రూ.25016, తృతీయ బహుమతి రూ.20016లతోపాటు ఎనిమిది జట్ల వరకు బహుమతులు అందజేస్తామన్నారు. మహిళా కోలాటాల్లో ప్రథమ బహుమతి రూ.20,016, ద్వితీయ రూ.16016లు, తృతీయ బహుమతి రూ.12016లతోపాటు ఎనిమిది కోలాట బృందాలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా క్రీడాకారులకు భోజన వసతి ఉంటుందని ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.



సూర్యాపేట : విద్యుత్ వెలుగుల్లో విద్యానగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం

ముస్తాబైన జంగమేశ్వరాలయం

అర్వపల్లి : మహాశివరాత్రి వార్షిక మహోత్సవానికి పర్సాయపల్లి గ్రామ శివారులోని గుట్టపై ఉన్న శ్రీ భవా నీసమేత జంగమేశ్వరాలయంలో ఏ ర్పాట్లు పూర్తయ్యాయి. ఈ గుట్టపై గ్రామస్తులు ఇటీవల ఈ జంగమేశ్వర ఆలయంను నిర్మించుకున్నారు. అయితే శనివారం మహాశివరాత్రి సందర్భంగా ఉదయం పంచామృత అభిషేకం, విశేషార్చన, గోత్ర నామార్చనలు, సాయంత్రం స్వామివారి తిరుకల్యాణం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, జాగరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అర్చకుడు సాయిరాం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



పర్సాయపల్లి జంగమేశ్వరాలయం

సంతోషిమాత ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం

భానుపురి : జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శ్రీ సత్యసాంబశివ స్వామి మహాశివరాత్రి వేడుకలు గురువారం కలశ స్థాపనతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకుడు శివరామకృష్ణ శర్మ శ్రీ సత్య సాంబశివ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, మంటప ఆరాధన పూజలు, ధ్వజారోహణం, దీక్ష వస్త్రధారణ, కంకణ ధారణతో పాటు రుద్రహోమం జరిపారు. శ్రీ సంతోషి మాత అమ్మవారికి శ్రీ చక్ర కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, ఉపాధ్యక్షుడు నరేంద్రుని విద్యాసాగర్ రావు, అన్నదాన నిర్వాహకులు దేవరశెట్టి సోమ య్య, ముదిరెడ్డి లింగారెడ్డి, మ హంకాళి ఉపేందర్, బొనగిరి విజయకుమార్, బట్టారం వంశీ కృష్ణ శర్మ, ఓరుగంటి కనకరత్నం, ఓరుగంటి జగదీశ్వరి, బచ్చు పురుషోత్తం, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ విగ్రహాల ప్రతిష్ఠ

సూర్యాపేట రూరల్ : కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలోని ఆలయాలకు పూర్వ వైభవం వచ్చిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని యండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ సమేత కోదండ రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని యండ్లపల్లి గ్రామంలో సీతారామచంద్రస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి రూ. లక్ష 1016 విరాళం అందజేశారు.

సంకినేని వెంకటేశ్వర్‌రావు పూజలు

మండల పరిధిలోని యండ్లపల్లి గ్రామంలో శ్రీసీతా, లక్ష్మణ, హనుమాన్ సమేత రామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి గురువారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెన్న శశిధర్‌రెడ్డి, జిల్లా నాయకులు ఉప్పు శ్రీనివాస్, తుక్కాని మన్మథరెడ్డి, కట్కూరి కార్తీక్‌రెడ్డి, పల్స మల్సూర్‌గౌడ్, అబీద్, బూర లక్ష్మణ్, రమేష్, శంకర్, శివాజీ, విజయ్, వెంకన్న, విజయ్, వెంకట్‌రెడ్డి, సాయికృష్ణ, ఎల్లారెడ్డి, పల్స వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు



పూజల్లో పాల్గొన్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



మాట్లాడుతున్న రాంబాబు

పెన్‌పహాడ్ : మండలంలోని కస్తూరిబా, ఆదర్శ పాఠశాల, వివిధ ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలుచేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంతోష్‌రెడ్డి, జానీపాషా, అమృత, రజియా, రమాదేవి, మధులత, ప్రమీల, సైదులు, శివ, విశ్వం పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల వైఖరిని నిరసిస్తూ ధర్నా



నాగారం : ఫణిగిరిలోని సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న దళితులు



తుంగతుర్తిలో విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాపంథా నాయకులు

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరిలో విద్యుత్ అధికారుల వైఖరికి నిరసనగా గురువారం సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై గ్రామానికి చెందిన దళితులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కరెంటు బిల్లు కట్టలేదనే సాకుతో గ్రామంలో పనిచేస్తున్న విద్యుత్ సిబ్బంది ఇళ్లల్లోకి చొరబడి దౌర్జన్యంగా టీవీ, ఫ్యాన్లు ఎత్తుకెళ్లడం తగదన్నారు. దళితులను అగౌరవపరిచే విధంగా వ్యవహరించిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెబుతుంటే అధికారులు మాత్రం అలాంటి పథకం ఏమీ లేదని విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారని అన్నారు. దళితులకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం దళితులను మోసం చేసిందన్నారు. అనంతరం విషయం తెలుసుకున్న ఎస్ఐ జి.ముత్తయ్య ఫణిగిరికి వచ్చి ధర్నా చేస్తున్న వారితో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో పంది గణేష్, ఎర్ర నరేష్, నాతి వీరమల్లు, అంబేద్కర్, ఎర్ర రాంబాబు, యాకోబు, గిరిప్రసాద్, సురేష్, నర్సింహ, అవిలయ్య, బాబేష్, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలి

తుంగతుర్తి : అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల నాయకుడు కాసర్ల దుర్గయ్య అన్నారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలో విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. విద్యుత్ కోతలతో పంట పొలాలు ఎండిపోతున్నాయని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు ఈర్జాల వెంకన్న, కాసర్ల శోభన్‌బాబు, కర్ణాకర్, నాగెల్లి ఉపేందర్, గొడ్డలి నర్సయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా యూరియా కొరత నెలకొంది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి పొలాలకు రెండో విడత యూరియా చల్లాల్సి ఉంది. అయితే మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, ఇతర ప్రైవేట్ దుకాణాల్లోనూ యూరియా దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గురువారం మండల పరిధిలోని నెమ్మికల్ పీఏసీఎస్ సెంటర్‌కు యూరియా బస్తాలు రావడంతో రైతులు ఎగబడ్డారు. బస్తాలు తక్కువగా ఉండటం, రైతులు అధికంగా రావడంతో క్యూలో నిలుచున్నారు. గంటల తరబడి క్యూలో నిలుచున్నా వెనుక ఉన్న రైతులకు యూరియా బస్తాలు దొరకలేదు.



నెమ్మికల్‌లోని పీఏసీఎస్ సెంటర్‌లో యూరియా కోసం బారులుదీరిన రైతులు

కరపత్రాల ఆవిష్కరణ

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని చిన్నగుట్టపై ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18న నిర్వహించే కల్యాణోత్సవాల కరపత్రాలను గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు పులిచర్ల మల్లికార్జున్, నరహరి, శివరాంచంద్, కృష్ణమూర్తి, యోగి, ప్రభు పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతులు దహనం

దురాజ్‌పల్లి : జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో బహుజన వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో గురువారం బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా బహుజన వామపక్ష సంఘాల నాయకులు మాట్లాడారు. మనిషి జన్మను అవమానపరిచి, మానవ అసమానతలకు, బానిసత్వానికి, దోపిడీకి కారణమైన మనుస్మృతిని పునరుద్ధరించడానికి జరిగే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు చామల అశోక్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు మందారి డేవిడ్‌కుమార్, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి చామకూరి నర్సయ్య, బహుజన ముక్తి పార్టీ జిల్లా కన్వీనర్ పల్లెటి రమేష్‌కుమార్, బుద్ధ సత్యనారాయణ, దంతాల రాంబాబు, డీటీఎఫ్ జిల్లా నాయకులు రేపాక లింగయ్య, యోగానంద, సీహెచ్ వెంకటయ్య, ధరావత్ నాగేంద్ర నాయక్, దాసరి రాములు, నారబోయిన వెంకట్ యాదవ్, గంటా నాగయ్య, కునుగుంట్ల సైదులు, రామోజీ, పీడీఎస్‌యూ నాయకులు భరత్, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.



ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

యోగానంద ఆలయంలో దొంగలదోపు సేవ



స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం దొంగలదోపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు పూలంగి సేవ జరిపారు. ఈ సందర్భంగా అశ్వవాహనంపై నర్సింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిల విగ్రహాలను అధిష్ఠింపజేశారు. అలాగే పల్లకిలో తిరుమంగై ఆళ్వార్‌స్వామిని ఊరేగించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు టెంకాయలు కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, స్వామి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



ఈటూరు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న హెచ్ఎం ప్రభాకర్



తుంగతుర్తి : విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న హెచ్ఎం శ్రీనివాస్

నాగారం : మండల పరిధిలోని ఈటూరు జెడ్పీహెచ్ఎస్‌లో 2012–2013 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ మిత్రులు రంజిత్, ఉప్పలయ్య, నర్మద, మమతల జ్ఞాపకార్థం గురువారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసం ప్రభాకర్ మాట్లాడారు. పూర్వ విద్యార్థులు తమ స్నేహితుల జ్ఞాపకార్థం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. పరీక్ష సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వినయ్, జి.నరేష్, బండి సాయికుమార్, కె.నరేష్, ఉదయ్, విజయ్, నాగరాజు, శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

తుంగతుర్తి : మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామవాసి, జెడ్పీహెచ్ఎస్ వెంపటి హెచ్ఎం మోతె శ్రీనివాస్ గురువారం రూ.15వేల విలువ గల షూను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం వెంకట్రామనర్సమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎల్లయ్య, రవీందర్, ఆంజనేయులు, జ్యోతి, నందన్‌కుమార్, రమాదేవి, స్వాతి, మంజుల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

భానుపురి : ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే పోచంపల్లి బ్యాంకు లక్ష్యమని చైర్మన్ కర్నాటి బాలసుబ్రహ్మణ్యం, సీఈఓ సీత శ్రీనివాస్ అన్నారు. బ్యాంకులో ఖాతా కలిగిన దాసరి వీరయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. ఈ సందర్భంగా నామిని అయిన వీరయ్య భార్య నాగలక్ష్మికి గ్రూప్ జనతా వ్యక్తిగత ప్రమాద బీమా ద్వారా రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కిషన్, సాయికుమార్, మల్లికార్జున్, కవిత, శృతి పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

చివ్వెంల : సూర్యాపేటకు చెందిన రియల్ వ్యాపారులు మండల పరిధిలోని మోదిన్‌పురం గ్రామ ఊర చెరువు నుంచి గత రెండు రోజులుగా మట్టిని తరలిస్తున్నారు. దీంతో వారిని గురువారం గ్రామస్తులు అడ్డుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. మట్టి తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను వారు కోరుతున్నారు.

కాసర్లపహాడ్‌లో బీజేపీ భరోసా యాత్ర

అర్వపల్లి : ప్రజాగోస–బీజేపీ భరోసా నినాదంతో చేపట్టిన యాత్రను గురువారం బీజేపీ నాయకులు కాసర్లపహాడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య మాట్లాడారు. ప్రజా వ్యతిరేక బీఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా, మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్, కూర శంకర్, అంగోతు శ్రీనివాస్‌నాయక్, జిన్నె అశ్విన్, మారపాక రాములు, వేముల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నిత్య అధ్యయనశీలి సీఎం కేసీఆర్



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న జూలూరి గౌరీశంకర్

మునగాల : నిత్య అధ్యయనశీలి సీఎం కేసీఆర్ అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని సాయి గాయత్రీ విద్యాలయంలో విద్యార్థులు పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ కవులు రాసిన పద్యాలు, కవితలను సామూహికంగా వారు చదివారు. సీఎం కేసీఆర్‌కు పుస్తక పఠనం ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలూరి గౌరీశంకర్ పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి కూడా నిరంతర అధ్యయనాన్ని వదలని అరుదైన సీఎంగా కేసీఆర్‌ను చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ కేఆర్ఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, సీనియర్ జర్నలిస్ట్ గంధం బంగారు, పాఠశాల ఏఓ ఆర్.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

అనంతగిరి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం చనుపల్లిలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో పాలారం, పాలారంతండా, చనుపల్లి గ్రామాలకు చెందిన 150మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఆయన ఆహ్వానించారు.

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతు

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని చిన్నగుట్టపై ఉన్న శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే డొంకరోడ్డు కంపచెట్లతో నిండి గుంతలమయం మారింది. దీంతో గురువారం స్థానిక ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్ స్వచ్ఛందంగా ఆ రోడ్డుకు మరమ్మతు చేయించారు. జేసీబీని ఏర్పాటు చేసి కంపచెట్లను తొలగించారు. రోడ్డుపై గుంతలు లేకుండా చేయించారు. మహాశివరాత్రి వేడుకలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా దారిని మరమ్మతు చేయించినట్లు చెప్పారు.



కంపచెట్లు తొలగిస్తున్న ఉపసర్పంచ్

శివస్వాముల ఇరుముడి



ఇరుముడులతో శివ స్వాములు

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో శివమాలధారులు గురువారం ఇరుముడి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో గురుస్వామి ఉప్పుల అంజయ్య, నాయిని శ్రీశైలం (శివ స్వామి) ఆధ్వర్యంలో స్వాములకు ఇరుముడులు కట్టారు. ఈ కార్యక్రమంలో కన్య స్వాములు, బంధు మిత్రులు గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

అన్యాయాలపై పోరాడాలి

నూతనకల్: సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో యువత పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని వెంకెపల్లిలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బండి యాదగిరి (నాగెల్లి) విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించి సామాన్య ప్రజలను నట్టేట ముంచుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, బత్తుల జనార్దన్, తొనుకునూరి ఉప్పలయ్య పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాగార్జున్‌రెడ్డి